నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 24 జనవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



కలెక్టర్‌కు వివరాలు వెల్లడిస్తున్న మహిళ

## అనాథ పిల్లలకు రేషన్‌కార్డు ఇప్పించండి సారూ..

● కలెక్టర్‌ను వేడుకున్న మహిళ

మంచిర్యాల అర్బన్, జనవరి 23 : పట్టణంలోని చున్నం బట్టివాడ(17వ వార్డు)లో గురువారం నిర్వహించిన వార్డు సభకు కలెక్టర్ కుమార్ దీపక్ రాగా, అదే వార్డుకు చెందిన సరిత అక్కడికి చేరుకొని తన అన్న తనుగుల రవి 2010లో, వదిన తనుగుల అంజలిరాణి 2015లో మృతి చెందారని, వారి కూతురు విష్ణుప్రియ, కొడుకు విజితేందర్‌లు అనాథలుగా మారి వారి నాన్నమ్మ తనుగుల రాజక్క దగ్గర ఉంటున్నారని, ఆ ఇద్దరి పిల్లలకు రేషన్‌కార్డు ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకుంది. ఇందుకు ఆయన స్పందించి సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషన్ మారుతీ ప్రసాద్, వార్డు కౌన్సిలర్ పూదరి సునీత ప్రభాకర్ తదితరులు ఉన్నారు.



కాసిపేట : సోమగూడెంలో గ్రామస్తులపై మండిపడుతున్న బెల్లంపల్లి ఎంపీవో శ్రీనివాస్

## సోమగూడెంలో గందరగోళం

కాసిపేట, జనవరి 23 : సోమగూడెం భరత్ కాలనీలో గురువారం జరిగిన గ్రామ సభలో గందరగోళం నెలకొంది. దరఖాస్తులు పూర్తి కాకుండానే సభ అయిపోయిందని ఎంపీవో శ్రీనివాస్ సహనం కోల్పోయి తిరగబడగా, ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులైన పేర్లు లిస్ట్‌లో రాకపోవడంతో అధికారులతో వాగ్వాదానికి దిగారు. అర్హులైన తమ పేర్లు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. సమాధానం చెప్పాల్సిన అధికారులు సహనం కోల్పోయి ప్రజలపై గొడవకు దిగగా, ఉన్నతాధికారులు, పోలీసులు జోక్యం చేసుకొని సముదాయించారు.



మంచిర్యాల టౌన్(దండేపల్లి) : తాళ్లపేటలో ప్రజలను సముదాయిస్తున్న ఎంపీడీవో

# గ్రామసభల్లో.. డే-3 రచ్చ రచ్చ

## మూడోరోజూ నిరసనలు.. ఆందోళనలు..

● ఎక్కడికక్కడ అధికారులను నిలదీసిన జనం ● అనర్హులను ఎంపిక చేశారంటూ మండిపాటు

● ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపికపై గందరగోళం

మంచిర్యాల, జనవరి 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పేరిట కాంగ్రెస్ సర్కారు నిర్వహిస్తున్న గ్రామసభలు రచ్చ రచ్చగా మారాయి. పథకాల ఎగవేతపై జనం అధికారులను నిలదీస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన పేదలకు చోటు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయ భరోసా పథకాల్లో చోటు దక్కకపోవడంపై గుండెమండిన సామాన్యులు తిరగబడుతున్నారు. అనర్హులను జాబితాలో చేర్చడంపై ఎక్కడికక్కడ నిలదీస్తున్నారు. మూడోరోజైన గురువారం కూడా గ్రామసభలు నిలదీతలు, నిరసనల మధ్య సాగాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గ్రామసభల్లో ఎక్కడ చూసినా ఈ దృశ్యాలే కనిపించాయి.

## ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలని..

చింతలమానేపల్లి, జనవరి 23 : ఇందిరమ్మ కమిటీలు రద్దు చేయాలని కర్జెల్లిలో నిర్వహించిన గ్రామసభలో పలువురు గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా, కొత్త రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో చాలా వరకు అర్హులైన పేర్లు నమోదు కాలేదని మండిపడ్డారు. ఇందిరమ్మ కమిటీల ఎంపికలో అవకతవకలు జరిగాయని అధికారులను నిలదీశారు. అనంతరం తహసీల్దార్ మునవర్ షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే దిందా, డబ్బా, రవీంద్రనగర్-1, హేటిగూడ, కర్జెల్లి గ్రామాల్లోనూ అర్హుల పేర్లు రాలేదని గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు.



కర్జెల్లిలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

నీల్వాయిలో అధికారులను నిలదీస్తున్న బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్



## జాబితాలో కాంగ్రెస్ కార్యకర్తల పేర్లు

వేమనపల్లి, జనవరి 23 : నీల్వాయి పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం నిర్వహించిన సభలో గందరగోళం నెలకొంది. ఆత్మీయ భరోసా జాబితాలో అర్హులైన వారి పేర్లు లేవని, అనర్హుల పేర్లు వచ్చాయని బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ అధికారులను నిలదీశాడు. కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పేర్లే జాబితాలో ఉన్నాయని, రేషన్ కార్డుల జాబితాలో వందల ఎకరాల భూములున్న వారి పేర్లు వచ్చాయని మండిపడ్డారు. ఈ విషయాన్ని కలెక్టర్‌కు తెలియజేస్తానని తెలిపారు. ఏపీవో సత్య ప్రసాద్ ఉన్నారు.

## అవకతవకలపై ఆగ్రహం

రామకృష్ణాపూర్, జనవరి 23 : క్యాతనపల్లి మున్సిపాలిటీలోని 14వ వార్డు పోచమ్మ బస్తీ, 22వ వార్డు భగత్‌సింగ్‌నగర్‌లో నిర్వహించిన సభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. లబ్ధిదారుల ఎంపిక జాబితాలో అవకతవకలు జరిగాయని మండిపడ్డారు. గతంలో 14వ వార్డులో నిర్వహించిన ప్రజాపాలనలో 100 మందికి పైగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకోగా, లబ్ధిదారుల జాబితాలో కేవలం 13 మంది పేర్లే వచ్చాయని, ఇందులో సింగరేణి రిటైర్డ్ కార్మికుల పేరు ఎంపిక చేయడమేమిటని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ప్రభుత్వ ఉద్యోగుల భార్యల పేర్లు, సింగరేణి ఉద్యోగుల భార్యల పేర్లు ఎంపిక చేశారంటూ అసహనం వ్యక్తం చేశారు.



22వ వార్డు సభలో అధికారులను నిలదీస్తున్న రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రానివారు

## అధికారుల నిలదీత

వాంకిడి, జనవరి 23 : తప్పుల తడకగా లబ్ధిదారుల జాబితా తాయారు చేశారంటూ నౌధారి, లక్ష్మీపూర్, వెల్గి, బెండార, కనర్‌గాం గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. జాబితాలోని తప్పులను సరి చేయడానికే సభలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకే అందుతాయని తహసీల్దార్ రియాజ్ అలీ నచ్చజెప్పారు. ప్రజల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు.



అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు

## తాళ్లపేటలో అసహనం

మంచిర్యాల టౌన్(దండేపల్లి), జనవరి 23 : తాళ్లపేట, లింగాపూర్, మామిడిపెల్లి, మేదరిపేట, దండేపల్లి, పెద్దపేట, లక్ష్మీకాంతాపూర్, కొండాపూర్, కాసిపేట, వెల్గనూర్, నంబాల గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. తాళ్లపేటలోలో ఎంపీడీవో ప్రసాద్ ఇందిరమ్మ ఇండ్ల అర్హుల లిస్ట్‌లో ఉన్న పేర్లు చదివి వినిపిస్తూ పేర్లు రాని వారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలని కోరగా, ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకుంటారని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అనర్హులను ఎంపిక చేశారని, అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇది నిరంతర ప్రక్రియ అని, ఈ లిస్ట్ ఫైనల్ కాదని అధికారులు ప్రజలను సముదాయించి గ్రామ సభను ముగించారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో ప్రసాద్, ఏవో అంజిత్‌కుమార్ ఉన్నారు.



తాళ్లపేటలో ప్రజలను సముదాయిస్తున్న ఎంపీడీవో

## సమయపాలన పాటించని అధికారులు

కౌటాల, జనవరి 23 : బోదంపల్లి, గురుడుపేట, తలోడి గ్రామాల్లో గురువారం నిర్వహించిన గ్రామ సభల్లో అధికారులు సమయపాలన పాటించలేదు. బోదంపల్లిలో ఉదయం 10 గంటలకు గ్రామ సభ ప్రారంభం కావాల్సి ఉండగా, 11 దాటినా అధికారులు, గ్రామ కార్యదర్శి రాలేదు. గురుడుపేటలో మధ్యాహ్నం 2 గంటల వరకు సమయం ఇచ్చి తీరా.. గ్రామస్తులు రాకముందే 12 గంటలకే గ్రామ సభ పూర్తి చేశారు. ఇక తలోడిలోనూ సమయ పాలన పాటించలేదు. పథకాల జాబితాలో అర్హుల పేర్లు లేవని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ఎక్కడా వసతులు కల్పించకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎంపీడీవో ప్రసాద్, ఎంపీవో మహేందర్‌రెడ్డి ఉన్నారు.



కౌటాల మండలం బోదంపల్లి గ్రామంలో 11 గంటలు దాటినా రాని అధికారులు

## కాంగ్రెస్ నాయకుల పెత్తనం

మందమర్రి, జనవరి 23 : మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 23, 18వ వార్డులతో పాటు పాత బస్టాండ్, గాంధీనగర్‌లో గురువారం నిర్వహించిన సభల్లో కాంగ్రెస్ నాయకులు పెత్తనం చెలాయించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అధికారిక కార్యక్రమంలో ప్రత్యక్షంగా పాల్గొని అంతా వారే అన్నట్లుగా వ్యవహరించగా, బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు అసహనం వ్యక్తం చేశారు. పలుచోట్ల షామియానాలు వేయకపోవడంతో పాటు సరిపడా కుర్చీలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



మందమర్రి పాతబస్టాండ్ ఏరియాలో సభను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

# పత్తి కొనుగోళ్లపై నిర్లక్ష్యం చేస్తారా?

● రెండు రోజులుగా ఇక్కడే ఉన్నా పట్టించుకోరా..

● రైతుల ఆగ్రహం.. చెన్నూర్‌లో ధర్నా



పత్తి కొనుగోళ్లు చేపట్టాలని చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

చెన్నూర్ రూరల్, జనవరి 23 : 'చెన్నూర్ మండలం కిష్టంపేట గ్రామ సమీపంలోని వరలక్ష్మి జిన్నింగ్ మిల్లులో పత్తి కొంటలేరు. రెండు రోజులుగా ఇక్కడే ఉంటున్నం. అడిగితే నిర్లక్ష్యపు సమాధానమిస్తున్నరు.' అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. రెండు రోజులుగా పత్తి వాహనాలతో ఇక్కడే ఉంటున్నామని, కొనుగోలు చేయాలని సీసీఐ అధికారులను అడిగితే నిర్లక్ష్యపు సమాధానాలు చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దళారులు, సీసీఐ అధికారులు కుమ్మక్కై రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే సీసీఐ కొనుగోళ్లు నిలిపివేశారని, ప్రైవేట్‌లో అమ్ముకోవాలని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై పడుకొని నిరసన చేయడంతో సుమారు గంట పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా స్థాయి అధికారులు చొరవ తీసుకొని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను మిల్లు నిర్వాహకులు అమలు చేయాలని కోరారు. ఈ విషయంపై మార్కెట్ కమిటీ సెక్రటరీ రామాంజనేయులును వివరణ కోరగా.. పలు మిల్లుల్లో పత్తి నిల్వలు పేరుకుపోయాయని, అందుకే కొనుగోళ్లు నిలిపివేశారని తెలిపారు. వరలక్ష్మి మిల్లు వద్ద ఉన్న పత్తి వాహనాలను వేరే మిల్లుకు పంపించి, అక్కడ కొనుగోళ్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలి

● ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 23 : అంగన్‌వాడీ కేంద్రాల్లోని సేవలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్‌లో గల సఖి కార్యాలయంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీడీపీవోలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఆడెపు భాస్కర్, యూనిసెఫ్ ప్రతినిధి రేశాదేశాయ్, సీహెచ్ సీఈజీఐస్ సంస్థ ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీల ద్వారా పిల్లలు, గర్భిణులు, రక్తహీనత సమస్య ఉన్న బాలింతలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. సూపర్ వైజర్లు, సీడీపీవోలు, పోషణ్ అభియాన్ సమన్వయకర్తలు పాల్గొన్నారు.

### గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

జిల్లా కేంద్రంలో ఈ నెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో చేపడుతున్న ఏర్పాట్లను ఎస్పీ శ్రీనివాస్ రావు, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ ఏఎస్పీ చిత్తరంజన్, ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి పరిశీలించారు. ఆయా శాఖల అధికారులకు కేటాయించిన విధుల ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేసి సిద్ధంగా ఉండాలన్నారు.



మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

# కాంట్రాక్టు కార్మికుడిని విధుల్లోకి తీసుకోవాలి

కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ప్రభాకర్

శ్రీరాంపూర్, జనవరి 23 : శ్రీరాంపూర్ ఏరియా సివిల్ డిపార్ట్‌మెంటులో కాంట్రాక్టు వర్కర్(ప్లంబర్)గా పనిచేస్తున్న గోపు శివకాంత్ అనారోగ్యంతో నెల రోజులు విధులకు హాజరు కాలేకపోయాడని, పూర్తిగా కోలుకొని వచ్చినా సివిల్ సూపర్‌వైజర్ విధుల్లోకి తీసుకోవడం లేదని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఏరియా కార్యదర్శి ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. గురువారం శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో గోపు శివకాంత్ తల్లి సమ్మక్క, భార్య మేఘన, ఇద్దరి పిల్లలతో కలిసి విలేకరుల ముందు తమ గోడును వెల్లబోసుకున్నారు. మేఘన మాట్లాడుతూ తన భర్తను నెల రోజులుగా విధుల్లోకి తీసుకోకుండా సివిల్ సూపర్‌వైజర్లు తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఉదయం శ్రీరాంపూర్ సివిల్ ఆఫీస్ వద్ద అధికారులను ఎంత ప్రాధేయపడినా విధుల్లోకి తీసుకోక పోవడంతో మనస్థాపం చెంది కనిపించకుండా వెళ్లిపోయాడని, ఇందుకు సివిల్ సూపర్‌వైజర్లు బాధ్యత వహించాలని తెలిపారు. సివిల్ కాంట్రాక్టర్ రాంరెడ్డి, డీవైజీఎం ఆనంద్‌కుమార్‌లను కలిసి విజ్ఞప్తి చేస్తే విధుల్లోకి తీసుకోవాలని సూపర్‌వైజర్‌కు వారు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. శివకాంత్ కనిపించకుండా పోవడంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.